క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



పిడుగురాళ్ల: సీజనల్ వ్యాధులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని సూచించారు. పట్టణంలోని లెనిన్ నగర్, చంద్రపాలెం కాలనీలో ఫాగింగ్ చేశారు. అనంతరం పట్టణంలోని పురవీధుల్లో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. మున్సిపల్ సిబ్బందితో చెత్తను తొలగింపు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల వల్ల ప్రజలు ఇబ్బందులు పడి వ్యాధులు ప్రబలుతున్నాయని, వాటిని తగ్గించేందుకు పట్టణంలో ఫాగింగ్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. శివారు ప్రాంతాలలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా వస్తున్నాయని, వీటిని నివారించాల్సిన బాధ్యత మున్సిపల్ సిబ్బందిపై ఉందని తెలిపారు.

గల్లంతైన సత్యనారాయణ మృతదేహం లభ్యం



రెంటచింతల: మండలంలోని సత్రశాల వద్ద కృష్ణానదిలో శనివారం కాలుజారి పడి గల్లంతైన రెంటచింతలకు చెందిన నీలా సత్యనారాయణ మృతదేహం మూడో రోజు సోమవారం లభ్యమైనట్లు ఎస్ఐ సీహెచ్. నాగార్జున తెలిపారు. ప్రమాదం జరిగిన శనివారం జాలర్లు భార్య పద్మావతి మృతదేహాన్ని వెలికి తీయగా, అప్పటి నుంచి సత్యనారాయణ కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టారు. పుట్టి సహాయంతో జాలర్లు తీవ్రంగా కృషి చేయడం వల్ల భార్యాభర్తల మృతదేహాలు లభ్యమైనట్లు బంధువు నీలా రామారావు తెలిపారు. శవపంచనామా నిమిత్తం సత్యనారాయణ మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని ఎస్ఐ తెలిపారు. మృతుల కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

డిప్యూటీ డీఈవో ఆకస్మిక తనిఖీ



రొంపిచర్ల: మండలంలోని బుచ్చిబాపన్నపాలెం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా ఉప విద్యా శాఖ అధికారి వేణుగోపాలరావు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల్లోని రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న 10వ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. బడికి హాజరు కాని, హాజరు తక్కువగా ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు చర్చించాలన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో స్టడీ అవర్‌లు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. మధ్యాహ్నం భోజన పథకంలో విద్యార్థులకు అందిస్తున్న మెనూను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తుర్లపాటి వెంకట సుబ్రమణ్యేశ్వర రావు, ఉపాధ్యాయులు పి.కోటేశ్వరమ్మ, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పరుగు పందెం పోటీలు

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు, రొంపిచర్ల శాఖ గ్రంథాలయాల వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు సోమవారం పరుగు పందెం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి. షాదీదా, డి. నాగబాబు, బి. రమేష్‌లు నిర్వహించారు. శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పోటీతత్వం అలవడుతుందని తెలిపారు. కార్యక్రమాల్లో గ్రంథాలయ అధికారులు కె. వెంకట్రావు. జి. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూఎన్‌లో వర్క్‌షాప్



నరసరావుపేట రూరల్: జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నాన్ డిస్ట్రిక్ టెస్టింగ్‌పై సోమవారం వర్క్‌షాపు నిర్వహించారు. విశాఖపట్నం భారత్ ఇన్స్టిట్యూట్ అండ్ టెక్నికల్ సర్వీసెస్ ప్రతినిధులు సీహెచ్ సతీష్‌కుమార్, ఎం.బాలకృష్ణలు రీసోర్స్ పర్సన్స్‌గా పాల్గొని క్వాలిటీ కంట్రోల్ టెస్టింగ్ విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్క్‌షాపును కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.హెచ్.శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వైఎస్ కిషోర్‌బాబు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఐఎస్ ఫణిసుష్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదవాడికి రేషన్ పరేషాన్

- సక్రమంగా అందని బియ్యం
- డబ్బు మాత్రమే ఇస్తామంటున్న రేషన్ వాహనదారులు
- మాచవరం వయా తెలంగాణ తరలిపోతున్న బియ్యం



పాతగణేశునిపాడులో రేషన్ షాపు వద్ద బారులు తీరిన ప్రజలు

పిడుగురాళ్ల: కూటమి ప్రభుత్వం రాగానే రేషన్ బియ్యం పేదవాడికి అందని ద్రాక్షగా మారింది. తినడానికి గుప్పెడు మెతుకులు కూడా దొరకడం లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఒక్క రూపాయికే కిలో బియ్యాన్ని ఇంటి దగ్గరే అందించింది. రేషన్ వాహనాలను ఏర్పాటు చేసి పథకాన్ని సమర్థంగా అమలు చేసింది. కూటమి ప్రభుత్వం గురజాల నియోజకవర్గంలో వాహనాలకు మంగళం పాడింది. దీంతో కార్డుదారులకు రేషన్ కష్టాలు ప్రారంభమయ్యాయి. పాత పద్ధతిలో షాపులకు వెళ్లి వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అంతేకాకుండా రేషన్ డీలర్లు కొత్త మతలపు పెడుతున్నారు. రేషన్ ఇవ్వం.. డబ్బులు ఇస్తామని, కేజీ బియ్యం రూ. 10 చొప్పున కొనుగోలు చేస్తామని చెబుతున్నారు. బియ్యమే కావాలంటే ఇవ్వలేమని తేల్చి చెబుతున్నారు. మాచవరం వయా తెలంగాణకు రేషన్ బియ్యం తరలిపోతున్నా పౌర సరఫరా అధికారులు పట్టించుకోవడం లేదు.

కొన్నిచోట్ల 20 కేజీలకు 18 కేజీలే...

డబ్బులు ఇస్తే తీసుకోకుండా వాదించే వారికి రేషన్ డీలర్లు మొండిగా సమాధానం చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి బియ్యం సక్రమంగా రాలేదని, 20 కేజీలు వచ్చే కుటుంబానికి 18 కేజీలు మాత్రమే ఇస్తామని చెబుతున్నారు. అది కూడా సక్రమంగా అందించడం లేదు. దుకాణాల్లో ఎప్పుడు ఉంటారో తెలియక కార్డుదారులు అవస్థలు పడుతున్నారు.

రేషన్ సరఫరా బండికి మంగళం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా రేషన్ బియ్యం వాహనం ఇంటి వద్దకే వచ్చేది. గత రెండు నెలల నుంచి రావటం లేదు. రేషన్ బియ్యం డీలర్ వద్దకు వెళ్తే రేషన్ ఇచ్చేశాం.. అయిపోయ్యాయంటూ చేతులు దులుపుకుంటున్నారు. వాహనదారులేమో బియ్యం తమ వద్ద అయిపోయాయని, డీలర్ వద్ద తెచ్చుకొండి అంటూ కార్డుదారులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఇప్పటికైనా సంబంధించి అధికారులు స్పందించి రేషన్ సక్రమంగా సరఫరా అయ్యేలా చూడాలని కార్డుదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



పడిపూజలో పాల్గొన్న మాలధారులు, భక్తులు

గోలి(రెంటచింతల): మండలంలోని గోలి గ్రామంలో సోమవారం రాత్రి అయ్యప్ప నామస్మరణ మార్మోగింది. మాలధారులు, వందలాది మంది భక్తులు శరణం శరణం అయ్యప్ప.... స్వామి శరణం అయ్యప్ప అంటూ చేసిన నామస్మరణతో గ్రామం పులకించి పోయింది. గ్రామానికి చెందిన త్రిపురా నాగేశ్వరరావు నేతృత్వంలో పడిపూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురుస్వామి పటాల సుబ్బారావు ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి 18 రకాల అభిషేకాలతో పాటు పలు పూజలు నిర్వహించారు. అయ్యప్ప జీవిత చరిత్రకు సంబంధించిన పాటలతో, శివపార్వతులుగా కళాకారులు నాట్య ప్రదర్శనతో అలరించారు. మణికంఠుడి భజనతో స్వాములు తన్మయత్వం చెందారు. అరటి బోదెలతో ఏర్పాటుచేసిన అయ్యప్పస్వామి మండపం, 18 మెట్లు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మాలధారులకు త్రిపురా నాగేశ్వరరావు స్వామి సద్ది ఏర్పాటు చేశారు.

రైతుకు శాపంగా మారిన అధికారుల నిర్లక్ష్యం



తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న రైతు గాలి వెంకటేశ్వర్లు

శావల్యాపురం: రెవెన్యూ అధికారులు అవినీతి , నిర్లక్ష్యం వల్ల సాగు భూములున్న రైతులు తీవ్రస్థాయిలో ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి కె.వి.ఆర్.మోహన్ చందు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజాఫిర్యాదుల దినోత్సవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పిచికలపాలెం గ్రామానికి చెందిన గాలి వెంకటేశ్వర్లుకు చెందిన సాగు భూమి విస్తీర్ణం తగ్గించారని తహసీల్దారు కె.సుజాతకు లిఖితపూర్వకంగా సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2016లో గ్రామానికి చెందిన తుర్లపాటి సీతయ్యకు చెందిన భూమిని అదే గ్రామానికి గాలి వెంకటేశ్వర్లు సర్వే నంబరు 324లో ఉన్న ఎకరం 45 సెంట్లు సాగు భూమి కొనుగోలు చేసి రిజిష్టరు చేయించి పట్టాదారు పాసుపుస్తకం ప్రభుత్వ నిబంధనలు సాగులో ఉన్నాడని చెప్పారు. సదరు రైతు కొనుగోలు చేసిన సాగుభూమి సమగ్ర వివరాలన్నీ అప్పట్లో వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. 2020లో ఇదే భూమిని తుర్లపాటి సీతయ్య రెవెన్యూ అధికారుల ప్రమేయంతో లంచం ఇచ్చి తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృషించి చేబ్రోలు శిరీషాకు అమ్మేశారని ఆరోపించారు. తనకు సాగు భూమి ఎకరం 45 సెంట్లు ఉండాల్సి ఉండగా ఆన్‌లైన్ భూ విస్తీర్ణం తగ్గించి 0.98 సెంట్లు భూమిని వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసినట్లు బాధిత రైతు గాలి వెంకటేశ్వర్లు వాపోయారు. మిగిలిన భూమిని శిరీషా పేరుపై వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేశారని ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు సత్వరమే విచారణ చేసి సంబంధిత రైతుకు న్యాయం చేయాలని కె.వి.ఆర్. మోహన్‌చందు తహసీల్దార్‌ను కోరారు.

క్యాన్సర్ సర్వే పారదర్శకంగా చేయాలి



మాట్లాడుతున్న హనుమ కుమార్

శావల్యాపురం: గ్రామాల్లోని వైద్య ఆరోగ్య సిబ్బంది ఎన్‌సీడీ 3.0 సర్వే పారదర్శకంగా చేయాలని జిల్లా ఫ్యామిలీ వైద్యాధికారి ప్రోగ్రాం నోడల్ అధికారి హనుమ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14 ఎన్‌సీడీ సర్వే ప్రారంభమైందని, వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటినీ సందర్శించి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారి సమగ్ర వివరాలు సేకరించాలన్నారు. ఈసర్వేలో బీపీ, షుగర్, థైరాయిడ్, తదితర వ్యాధులతో పాటు క్యాన్సర్ వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి సకాలంలో వైద్యసేవలు అందించటం ద్వారా నివారణ చేయటానికి దోహదపడుతుందని తెలిపారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో నమోదు చేయు సమయంలో ఏమైనా సందేహాలు ఉంటే సత్వరమే నివృత్తి దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆరు నెలల పాటు సర్వే జరుగుతుందని తెలిపారు. వైద్య ఆరోగ్య సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో పాటు వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్, సూపర్‌వైజరు అలవపలపూడి ఏడుకొండలు, ఉమాదేవి, స్టాఫ్‌నర్సు బాలిబోయిన లక్ష్మి ప్రసన్న తదితరులు ఉన్నారు.

ఉపాధి నిధులతో గ్రామాభివృద్ధి

ఎంపీడీవో సీతారామయ్య



శావల్యాపురం: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకం నిధులు గ్రామాభివృద్ధికి దోహదపడతాయని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. సోమవారం మండలంలోని కనమర్లపూడి, శావల్యాపురం గ్రామ పంచాయతీలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పనుల ఆమోద గ్రామసభలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో సీతారామయ్య మాట్లాడుతూ కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సారథ్యంలో గ్రామపంచాయతీల్లో నిర్వహించే ఉపాధి పనులు ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలన్నారు. ఉపాధి నిధులు దుర్వినియోగం కాకుండా ముందుస్తుగా గ్రామాల్లో గుర్తించిన పనులకు ఆయా గ్రామస్తుల సమక్షంలో పంచాయతీ తీర్మానంతో పాటు పరిపాలన ఆమోదం పొందడానికి ఈ గ్రామసభలు ఏర్పాటు చేశామన్నారు. కనమర్లపూడిలో 61 పనులకు గాను రూ.64 లక్షల నిధులు, శావల్యాపురం గ్రామపంచాయతీలో 85 పనులకు రూ. 61 లక్షల నిధులను అమోదించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు తన్నీరు భారతి, యాగసిరి చెన్నమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మరియమ్మ, ఏపీవో కె.రామారావు, పంచాయతీ కార్యదర్శులు బొడ్డు యాకోబు, బాల పరమేశ్వరరావు, టీఏ రోజారాణి, ఫీల్డ్ అసిస్టెంట్స్ చెరుకూరి బాలకృష్ణ , గ్రామస్తులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ బ్లడ్‌సెంటర్‌లో రక్తదానం



నరసరావుపేట: జిల్లా మొట్టమొదటి కలెక్టర్‌గా పనిచేసిన ఎల్.శివశంకర్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ప్రభుత్వ వైద్యశాలలోని రెడ్‌క్రాస్ బ్లడ్‌సెంటర్‌లో ఆయన అభిమానులు ఐదుగురు రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ కంజుల జగన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కలెక్టర్ శివశంకర్ ప్రత్యేక చొరవ తీసుకొని బ్లడ్ సెంటర్‌కు ప్రభుత్వ వైద్యశాలలో ప్రత్యేక స్థలం కేటాయించారన్నారు. ఇప్పుడు దీనివలన ఎంతో మందికి అత్యవసర స్థితిలో రక్తం అందించే అవకాశం కలిగిందన్నారు. కార్యక్రమంలో డిస్టిక్ కోఆర్డినేటర్ పి.వెంకటేశ్వర్లు, దాచేపల్లి మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

పోటీతత్వంతోనే జీవితంలో ఉన్నత స్థానం



రెంటచింతల: విద్యార్థులు పోటీతత్వాన్ని కలిగి ఉన్నప్పుడే జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకుంటారని స్థానిక గ్రంథాలయ అధికారి రాయపాటి రాజకిశోర్ తెలిపారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో లూథరన్ బాలికల ఉన్నత పాఠశాల, వివేక స్కూల్, బాలవికాస్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ చెందిన విద్యార్థినులకు ఉదయం జూనియర్ విభాగంలో పర్యావరణం -పరిరక్షణ, సీనియర్ విభాగంలో వరదలు- వాటి ప్రభావాలు- నివారణ చర్యలు అనే అంశాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పోటీల్లో 50 మంది పాల్గొన్నట్లు రాజకిశోర్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని పద్మ, గ్రంథాలయ సిబ్బంది కె. సందేష్, పి.కమల పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోత

దుర్గి: మండల పరిధిలోని దుర్గి పట్టణంలో పలుచోట్ల మరమ్మతులు నిర్వహిస్తున్న కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాను ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిలిపి వేయనున్నట్లు డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఓఎస్‌డీ ఎ. రామయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

నేడు డయల్ యువర్ డిపో మేనేజర్

పిడుగురాళ్ల: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు మేనేజర్ బి. కోటేశ్వరనాయక్ తెలియజేశారు. ప్రయాణికులు, గ్రామస్తులు తమ సలహాలు, ఫిర్యాదులను 9959225430 నంబర్‌కు తెలియజేయాలని ఆయన సూచించారు.

వివరాలన్నీ యాప్‌లో నమోదు చేయాలి

శావల్యాపురం: స్వయం సహాయక మహిళా సభ్యులు జీవనోపాదులు పెంపుదల సమగ్ర వివరాలన్నీ ఇన్కమ్ యాప్ సర్వేలో నమోదు చేయాలని ఏపీయం జి.వాసుబాబు అన్నారు. సోమవారం మండలంలోని వేల్పూరు గ్రామంలోని యానిమేటర్ల, మహిళా సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీయం మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో ఉన్ననటువంటి మహిళా సభ్యులకు సంబదించి బ్యాంకు రుణాలు, కుటుంబ సభ్యుల ఆదాయం, బ్యాంకు వివరాలు, ఉపాధి పథకం జాబ్‌కార్డు, రుణాలు వివరాలన్నీ తప్పులు లేకుండా పొరపాట్లు జరగకుండా వీవోఏలు యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈసర్వేకు సంబంధించి నగదు వసూలు చేయరాదని తెలిపారు. ఆయనతో పాటు సీసీలు ఖాజావలీ, మేరి కుమారి ఉన్నారు.

పాఠశాలలో ఉచిత కంటి వైద్యశిబిరం



నరసరావుపేట ఈస్ట్: బరంపేటలోని శ్రీకాసు బ్రహ్మానందరెడ్డి మున్సిపల్ పాఠశాలలో సోమవారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. మాక్సివిజన్ ఐ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ చెంచురెడ్డి పర్యవేక్షణలో వైద్య సిబ్బంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి ఐడ్రాప్స్ అందించారు. ఈసందర్భంగా డాక్టర్ చెంచురెడ్డి కంటి సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు కపలవాయి రాజేంద్రప్రసాదు, కార్యదర్శి సాతులూరి శివకుమార్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ మేళ్లచెరువు సుమిత్రకుమార్, పబ్లిక్ ఇమేజ్ డైరెక్టర్ షేక్.జిలానీమాలిక్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా రోటరీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, మాక్సివిజన్ సహకారంతో వారం రోజుల పాటు పట్టణంలోని పాఠశాలలు, కళాశాలల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు.

సత్రశాలలో వైభంగా కార్తిక పూజలు



ప్రత్యేక అలంకారంలో భ్రమరాంబికాదేవి



భక్తులకు అన్నదానం

సత్రశాల(రెంటచింతల): భక్తుల పాలిట కొంగు బంగారంగా ప్రసిద్ధిగాంచిన ప్రముఖ శైవక్షేత్రం సత్రశాలలోని శ్రీగంగా భ్రమరాంబికాదేవి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానానికి కార్తిక మాసం 3వ సోమవారం తెలుగు రాష్ట్రాలలోని అనేక ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు పోటెత్తి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే దేవస్థానం సమీపంలో నున్న పవిత్ర కృష్ణానదిలో స్నానాలు ఆచరించిన మాలధారులు, భక్తులు స్వామిని దర్శించుకున్నారు.ప్రధాన అర్చకులు చిట్టేలా మల్లికార్జున శర్మ నేతృత్వంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, వివిధ రకాల అభిషేకాలతోపాటు గణపతి, రుద్ర హోమాలను నిర్వహించారు. భక్తులకు, వివిధ స్వామి మాలధారులకు కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. ఏర్పాట్లను ఈఓ గాదె రామిరెడ్డి, దేవస్థానం అన్నదాన కమిటీ సభ్యులు గొట్టం శ్రీనివాసరెడ్డి, మున్నా ప్రభురాజు, నీలం మల్లయ్య పర్యవేక్షించారు.

శివాలయంలో వైభవంగా హోమాలు



హోమాలు నిర్వహిస్తున్న అర్చకులు

రెంటచింతల: స్థానిక శివాలయం ఆవరణలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద వేద పండితులు జిగురు చంద్రశేఖర్ నేతృత్వంలో సోమవారం దేవరశెట్టి దుష్యంత్, ధనలక్ష్మి దంపతులు భక్తిశ్రద్ధలతో హోమాలు, స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దుష్యంత్ దంపతులు 380 మంది స్వాములకు సద్ది వితరణ చేశారు. శివాలయం అధ్యక్షులు పల్లెర్ల లక్ష్మారెడ్డి, వెన్నా వెంకటేశ్వరెడ్డి అంబటి శ్రీనివాసరెడ్డి, కట్టమూరి శ్రీను స్వామి, పటాల సుబ్బారావు గురుస్వామి, కె. సైదులు స్వామి, స్వామి, సోములుస్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మాలధారులకు డిసెంబర్ 26 వరకు దాతల సహకారంతో అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టినట్లు అయ్యప్ప సేవా సమితి కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యార్థులతో బాధ్యతగా వ్యవహరిద్దాం



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులను ఆరోగ్యవంతమైన ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది సమాజానికి అందించటంలో కళాశాలలు కీలకపాత్ర పోషిస్తాయని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థుల నడవడిక, ఆలోచనలు, ఆసక్తి తదితర అంశాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ వారిని సమాజ శ్రేయస్సుకు దోహదపడేలా తీర్చిదిద్దాలని కోరారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం కళాశాలల యాజమాన్య ప్రతినిధులు, ప్రిన్సిపల్స్‌తో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు (డ్రగ్స్), ర్యాగింగ్, ఆత్మహత్యలు తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆయా అంశాలపై సుదీర్ఘంగా చర్చించి కళాశాలల యాజమాన్యాలకు తగిన సూచనలు చేశారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యాసంస్థల్లో భద్రతా పరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థుల మానసిక ఒత్తిడి, ఆత్మహత్య ధోరణుల సంకేతాలను గుర్తించటంపై అధ్యాపకులు దృష్టి సారించాలని తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను ఎప్పటికప్పుడు విద్యార్థులతో చర్చిస్తూ మానసిక పరివర్తన తీసుకురావాలని తెలిపారు. ఇటీవల విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం ఆందోళన కలిగిస్తున్న అంశమని తెలిపారు. ఉజ్వల భవిష్యత్ ఉన్న విద్యార్థులు క్షణికావేశాలతో జీవితాన్ని కోల్పోవటం పట్ల విచారం వ్యక్తం చేశారు. పోలీస్ శాఖ, విద్యాశాఖ అధికారులు, కళాశాలల యాజమాన్యాలు, సిబ్బంది, సామాజిక వేత్తలు, ప్రజలు సమిష్టిగా కృషి చేస్తూ నేరాలను అరికట్టడంతో పాటు యువతను అభివృద్ధి బాటలో నడపాలని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జె.వి.సంతోష్, జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాశాఖాధికారిణి ఎం.నీలావతిదేవి, డీఎస్పీలు కె.నాగేశ్వరరావు (నరసరావుపేట), ఎం.హనుమంతరావు (సత్తెనపల్లి) తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు ఆటల పోటీలు



ఆటల పోటీలను పారంబిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీల్

నరసరావుపేట రూరల్: ఆటలు శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడతాయని నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీల్ తెలిపారు. 77వ ఎన్‌సీసీ డే సందర్భంగా కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో క్యాడెట్స్‌కు ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునీల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్మీ సంబంధిత కార్యక్రమాల్లో హడావిడిగా ఉండే క్యాడెట్స్‌కు ఇటువంటి పోటీల్లో పాల్గొనడం వారిలో ఉత్సాహాన్ని నింపుతుందని తెలిపారు. గెలుపు, ఓటమిలను సమానంగా స్వీకరించడం ఈ ఆటల పోటీల ద్వారా క్యాడెట్స్ నేర్చుకోవచ్చని తెలిపారు. క్రికెట్, వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, మ్యాజికల్ ఛైర్ తదితర పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్, ఏవో శ్రీధర్, ఫిజికల్ డైరెక్టర్ ఎల్.కృష్ణారెడ్డి, వ్యాయామ అధ్యాపకులు ఆంజనేయులు, విజయ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తిక సోమవారం



ప్రత్యేక అలంకరణలో శ్రీ గంగా పార్వతీ సమేత వల్లభేశ్వరస్వామి

రొంపిచర్ల: మండల ప్రజలు కార్తిక సోమవారం పర్వదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. తెల్లవారు జాము నుంచే పుణ్యస్నానాలు ఆచరించి దీపారాధన కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయాలు భక్తులతో నిండాయి. భక్తులు ఉపవాసాలు పాటించారు. దేవతా మూర్తులు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఆయా దేవాలయాల ప్రధాన అర్చకులు కార్తిక సోమవారం ఉపవాసాల వల్ల కలిగే ప్రయోజనాలను, చేకూరే పుణ్యాలను వివరించారు. వడ్లమూడివారిపాలెం శ్రీ గంగాపార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి, రొంపిచర్ల శ్రీ శంకరస్వామి, బుచ్చిబాపన్నపాలెం శ్రీ వీరభద్ర స్వామి, విప్పర్ల శ్రీ గంగా పార్వతీ సమేత వల్లభేశ్వరస్వామి, కొత్తపల్లి శ్రీ హరిహర తదితర దేవాలయాలు భక్తులతో నిండాయి.

ఆధార్ క్యాంపులు సద్వినియోగం చేసుకోండి

నరసరావుపేట: పట్టణంలో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, మార్పుల కోసం రెండు ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంత రావు సోమవారం పేర్కొన్నారు. ప్రకాష్‌నగర్-2, రంగాస్ట్రీట్-2 సచివాలయంలో ప్రత్యేక క్యాంపులు ఈనెల 19వ తేదీ నుంచి 22వరకు, 26 నుంచి 29వరకు నిర్వహించబడతాయన్నారు. ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, డాక్యుమెంట్ అప్‌డేషన్, బయోమెట్రిక్ అప్‌డేషన్, అడ్రస్సు, జిల్లాల మార్పులు, ఆధార్ సేవలను ప్రభుత్వం నిర్దేశించిన రుసుం చెల్లించాలని తెలిపారు.